

'ఏమండీ' సుగుణ హాల్లోకొచ్చి పిలిచింది.

ఈ పిలుపు శేఖర్ చెవులకి యింకా అందలేదు. అది మొదటిసారి పిలిచిన పిలుపు అయితే వినిపించలేదేమో పాపం, పేపరు చదవడంలో దీక్షగా వున్నాడు అనుకోవచ్చును. కాని, అది మూడోసారి పిలిచిన పిలుపు.

'ఏమండోయ్, మిమ్మల్నేనండీ — ఎన్నిసార్లు పిలవాలి' ఈసారి కొంచెం గట్టిగానే పిలిచింది (అరిచింది) సుగుణ.

'ఇదుగో వచ్చేస్తున్నా...ఒక్క నిమిషం' అంటూ శేఖర్ పేపరు చదువుతూనే కుర్చీలోంచి లేచాడు.

'వస్తారట ఎక్కడికొస్తారో! కళ్ళెదుట చెట్టంత మనిషిని నిల్చున్నాను — కనిపించటంలేదూ' అతని సమాధానానికి మండిపడుతూ అంది సుగుణ.

ఆమె మాటల్లో వేడి కొంచెం తగిరి శేఖర్ తల ఎత్తాడు. 'ఇక్కడే వున్నావా? వంటింట్లోంచి అరుస్తున్నా వనుకున్నా' అంటూ తాపీగా కుర్చీలో కూర్చుని పేపరువైపు దృష్టి మరల్చాడు.

తను ఎందుకు పిలిచిందో తెలుసుకుందామనన్నా లేకుండా పేపరు చూస్తున్న భర్తని ఏం అనాలో తెలియక అయోమయంగా చూస్తూ నిలబడింది కాస్సేపు. అతని నిదానానికి తన నిదానంకూడ తోడయితే పన్లు తెమలవు అని తన కోపాన్ని అణుచుకుండి.

'పేపరు తర్వాత చూసుకోవచ్చు. వీణ్ణి కాస్త ఆడించడమో, వీధిలోకి తీసుకెళ్ళడమో చేస్తే నా పన్లు తొందరగా తెముల్తాయి.' అంది బాబుని కిందకి దింపుతూ.

సుగుణ మాటలు తను విన్నాడు అన్నట్లు తల వూపాడు శేఖర్. కానీ పేపరు చూస్తునే వున్నాడు.

'తల వూపడం చాలుగాని విణ్ణి తియ్యండి ముందు.' అంది వచ్చే కోపాన్ని అదిమిపెడుతూ.

'ఎవణ్ణి ?' పేపర్లో లీనమైన శేఖర్ అడిగిన ప్రశ్న.

సుగుణ విసురుగా సమాధానం యిచ్చింది. 'మీ సుపుత్రుణ్ణి.'

సుగుణ కంఠంలోని మార్పు అతణ్ణి

తల ఎత్తేటట్లు చేసింది. సుగుణని చూస్తూనే పేపరు పక్కకి పెట్టేశాడు. తన కాళ్ళ దగ్గర కొచ్చిన కొడుకుని చేతుల్లోకి తీసుకున్నాడు.

ఆ రోజేదో విశేషం వుంది అనుకున్నాడు సుగుణని చూస్తూనే. సుగుణ తలంటుకున్న జుట్టు జారుముడి వేసుకుంది. ముఖము, కాళ్ళు పసుపు రాసుకున్నట్లు కనిపిస్తున్నాయి. పట్టు చీర కట్టుకుంది. ముఖం మాత్రం ధుమ ధుమ లాడుతూ వుంది.

శేఖర్ నెమ్మదిగా గొంతు సవరించాడు. 'దేవీ! నీ పతిదేవుండు నటియింపబోవు నాటకంబునకు ఏ అవరోధంబులు వాటిల్లకుండునటుల పూజలు సలిపి, విజయవంతంబు సేయు మిక్కిలి ఆరాటపడుచున్న నిన్ను చూడ, అపరిమితానంద కందళిత హృదయారవిందుండనగుచున్నాడను' అంటూ వినమ్రంగా తల వంచాడు.

సుగుణ సహనం కోల్పోయింది. ఆమె కోపం తారాపథానికి అంటింది. 'నేను యింతవరకు వాగినదేదీ మీ చెవిలోకి దూరలేదన్నమాట' అంది.

'సాకల్యంగా వివరించు సుదతీ. సావధానంగా అవధరిస్తాం' అన్నాడు.

సుగుణ విసుగ్గా తల బాదుకుంది. అఘోరించినట్టుంది. పొద్దున్నే మొదలెట్టారేమిటి ఈ భాగోతం భాష. మీకు పుణ్యం వుంటుంది—వీణ్ణి కాస్సేపు అవతలకి తీసుకెళ్ళండి. ఇవాళ రథసప్తమి—పాలు పొంగించుకోవాలి. వీడు కాళ్ళకి చేతులకి అడ్డాలు పడుతుంటే పన్లు సాగవ్' అంది చికాకుపడుతూ.

శేఖర్ కూర్చున్నవాడల్లా వెంటనే లేచి నిలబడ్డాడు. 'ఇంతిరో, వలనుపడదు. మేము కత్తి పదును పట్టించి వుంచాం—యిన్నిసార్లు నరికినా తలలెత్తే ముష్కరాధములను హతమార్చవలసి వున్నది' అన్నాడు ఆవేశపూరితంగా.

శేఖర్ అలా అనేసరికి హడలిపోయింది సుగుణ. 'ఎవరి మీదకండీ యింత వుదయమే దండయాత్ర' భయపడుతూ అడిగింది.

'ఎంత సుగ్రాహ్యమయిన విషయమయినా నీకు అగ్రాహ్యమే — ఏమి చేయుదు—నా పూర్వజన్మ సుకృతమున లభియిస్తివి!' అంటూ పెదవి విరిచాడు.

ఫలించని పథకం

ఘోర కార్యాలు తలపెట్టినవాడయితే తనతో యింత తీరుబడిగా వాదిస్తాడా? రోజూ నాటకం రిహార్సలుకి వెళ్ళివస్తూ వుండడంచేత అబ్బిన జబ్బేమో యిది అనుకుని మనసుని స్థిమితపరచుకుంది.

'అది సుగ్రాహ్యమయిన విషయమో, అగ్రాహ్యమయిన విషయమో నా బొంద నాకేం తెలుస్తుంది! అదేదో త్వరగా చెప్పి...'

సుగుణ మాట పూర్తి కాకుండానే శేఖర్ అందుకున్నాడు. 'చెప్పి ఏడవండి అనకుమా' అన్నాడు.

'అదేదో నోట్లోంచి తొందరగా వూడిపడితే నేను వంటింట్లో పడతాను. అహో...తొందరేం లేదు— హోటల్నుండి కేరేజి తెచ్చుకు తిందాం అంటారా—మీ సోది వినడానికి నా అభ్యంతరం ఏమీ లేదు.' అంటూ అక్కడున్న కుర్చీ దూరంగా లాక్కుని కూర్చుంది.

కొడుకుతో ఆడుకుంటున్న శేఖర్ వెంటనే తల ఎత్తాడు. 'హోటల్ భోజనం' అతన్ని తల ఎత్తేటట్లు చేసింది. 'నే నొక మాట చెప్పబోతుంటే ఆ తొందరెందుకు నీకు? ఆ రేజరు పని చెయ్యటంలేదని కత్తి నూరి వుంచాను. కాస్త యీ గెడ్డం గీసుకోవాలి' అన్నాడు చెంపలు చేత్తో రాసుకుంటూ.

'ఆదివారం కూడ తొందరేనా? ఆ గడ్డమేదో తర్వాత గీకొచ్చును. మిమ్మల్నే పెళ్లికూతురు చూడరావటంలేదు కదా! వీణ్ణి కాస్సేపు ఆడిస్తే నా పూజ, వంట అయి మీకు కంచంలోకి పదిగంటలకి అన్నం వస్తుంది' అంది. ఆ తర్వాత మీ యిష్టం అన్నట్లు కూర్చుంది.

'వీణ్ణి ఆడించడానికి నాకు టైములేదు. మాకు తొమ్మిదిగంటలకి రిహార్సలు. ఈరోజే కదా నాటకం. మళ్ళీ రాత్రికే నేను రావడం. ఆ వంట సంగతేదో ముందు చూడు. నేను వెళ్ళాక తీరుబడిగా పాలు పొంగించవచ్చు' అనేసి చల్లగా అక్కడినుండి జారుకున్నాడామె పతిదేవుడు.

సుగుణ నిట్టూరుస్తూ లేచింది. 'ఆదివారంకూడ నా ప్రాణానికి విరామం లేదు కదా. పైగా సలహా కూడాను—తను వెళ్ళాక పాలు పొంగించాలిట. మిట్టమధ్యాహ్నం పాలు పొంగిస్తే, సూర్యభగవానుడు నన్ను మెచ్చి పుణ్యలోకాలకి పంపిస్తాడు' అంటూ వంటింటి వైపు వెళ్ళిపోయింది.

ఆ మాటలు శేఖర్ వినాలనే వుద్దేశంతో అన్నవేకనుక గదిలో గెడ్డం గీసుకుంటున్న శేఖర్‌కి బాగానే వినిపించాయి. ఆ పని పూర్తిచేసి వంటింటి గుమ్మంలో కొచ్చి నిలబడ్డాడు.

'ప్లీజ్, ఈ ఒక్క ఆదివారం నిన్నూ నన్నూ తిట్టుకోకుండా గడపేస్తే, వచ్చే ఆదివారంనుండి ఎక్కడికీ యింత పొద్దున్నే కదలను' అన్నాడు.

సుగుణ చురచురా చూసింది శేఖర్ని. 'వచ్చే ఆదివారం నేనిక్కడ వుంటే కదా!' అంటూ నిర్లక్ష్యంగా ఎగరేస్తూ ముఖం తిప్పుకుంది.

సుగుణ కళ్లల్లో మెరుపు, పెదవులపై చిరునవ్వు శేఖర్ దృష్టినుండి దాటిపోలేదు. ఆమె ముఖం తిప్పుకునేలోపల ఒక క్షణం ఆ రెండూ ప్రతిఫలించాయి.

సుగుణకి మూడురోజుల క్రితమే తల్లి దగ్గరనుండి వుత్తరం వచ్చింది. 'సుగుణ అక్క, పిల్లలూ ఢిల్లీనుండి వస్తున్నారని, సుగుణ పెళ్ళికి రాలేకపోయినందుకు యిప్పటికీ బాధ పడుతోందని, సుగుణని యిప్పుడు చూడకపోతే మళ్ళీ ఎన్నాళ్ళకు చూస్తానో అని రాసిందని, కనుక చంటాడిని తీసుకుని నువ్వు వచ్చావంటే మీ యిద్దర్నీ చూసి చాలా సంతోషిస్తుంది' అని ఆ వుత్తరంలో సారాంశం.

ఆ రోజునుండి మొదలు — పుట్టింటికి వెడతానని సుగుణ, వద్దని శేఖర్.

శేఖర్ వెళ్ళొద్దు అనడానికి కారణం లేకపోలేదు. ఆరు నెలల క్రితమే పుట్టింటికి వెళ్ళి వచ్చింది మళ్ళీ యిప్పుడు ప్రయాణం అవుతోంది.

'ఆర్నెల్లకోసారి యీ ప్రయాణాలేమిటి? మీ అక్కనే యిక్కడికి రమ్మని రాయి. ఎలాగూ యింత దూరం వచ్చింది' అన్నాడు శేఖర్.

'వారం రోజులంటే వారం రోజులే వుంటానండీ—అంతకంటే ఎక్కువ రోజులు ఎవరు బలవంతంచేసినా వుండనంటే నమ్మండి' అంటూ ఎంతో నమ్మకంగా చెప్పింది.

'నాకిష్టంలేదు' అంటూ ఆ రోజు ఆ సంభాషణ అంతటితో ఆపేశాడు శేఖర్

బేబీటోన్
గ్రైప్ మిక్శ్చర్

అతన్ని ముద్దుగా నవ్వించండి!

బంతాచేసి యేడాదే. ఇంతలోనే ఆరు పళ్ల వచ్చేశాయి. ఎంతో సరదాగా వున్నాడు. ఆరోగ్య సూచకమైన ఆకలి. గాఢ నిద్రపోతాడు. కాని కడుపునొప్పా? అది తగ్గటం ఎంతో సేపు కాదులెండి బేబీటోన్ గ్రైప్ మిక్శ్చర్‌కు ధన్యవాదాలు

స్టాకిస్టు: ABC వారి ఉత్పత్తి

అమర్‌శోభ పోస్టు బాక్సు 518, మద్రాసు-3
పోస్టు బాక్సు 16460 బొంబాయి-16

వాయిదాల పద్ధతిపై ట్రాన్సిస్టరు



ప్రపంచప్రఖ్యాతిగల, శక్తివంతమయిన 3 బ్యాండ్ త్రీ వరల్డ్ 'టెలి-నేషనల్' ఇంగ్లీష్ మాడల్ ట్రాన్సిస్టర్ గ్యారంటీతో సహా నెలకు రు. 5 లు వంతున చెల్లించి పొందండి. ధర: రు. 165. ప్రతి పట్టణమునకు, గ్రామమునకు పంపబడగలదు.

LITZ AGENCIES (WAP)
P. B. 1267. DELHI—6.

యువతీ యువకుల ఆనందానికి ఆంతరంగిక సమస్యా పరిష్కారానికి అనుభవానికి, లైంగిక విజ్ఞానానికి ఎల్లప్పుడూ— అంబడిపూడి పుస్తకాలనే చదవండి. మీ ఊళ్లో న్యూస్ ఏజెంటును అడగండి. లేదా 10 రూపాయలు పంపుతూ మాకు వ్రాయండి. పంపుతాము.

జలజ ప్రచురణలు, విజయనగరం-3

ఫలించని పథకం

మళ్ళీ యీ రోజు అదే మాట. తను వెళ్లితీరతాను అంటోంది. సుగుణ పుట్టింటికి వెడతానన్నప్పుడల్లా శేఖర్‌కి దిగులే. వెళ్లిన మనిషి వెంటనే రాదు. అతని ఓర్పుని పరీక్షించడానికా అన్నట్లు, నెల రోజులు మకాం వేస్తుంది. టెలిగ్రాం యివ్వకపోతే మొగుడనేవాడొకడు యిక్కడున్నాడని గుర్తే రాదు అంటాడు. ప్రతిసారి టెలిగ్రాం యిస్తే ముక్కున వేలు వేసుకుంటారు అంటుంది, సుగుణ.

సుగుణ పుట్టింటికి ఎప్పుడు ప్రయాణం పెట్టుకున్నా సాధ్యమయినంతవరకు శ్రమపడి ఆటంకాలు వెతుకుతాడు. ఇప్పుడుకూడ సుగుణని ఆపడానికి బలమైన కారణాలు అన్వేషిస్తున్నాడు.

ఇదివరకు సుగుణ భర్త సృష్టించే అవరోధాల వెనక వున్న అనురాగానికి, ప్రాధేయపూర్వకమైన చూపులకి కరిగి కొన్నిరోజులు ప్రయాణం వాయిదా వేసేది. ఈసారి చాలాకాలానికి వచ్చే అక్కని చూడాలని ఎంతో ఆతురతతో ప్రయాణం పెట్టుకుంది. అనుకున్నరోజుకే వెళ్లాలని గట్టి పట్టుదలతో వుంది.

శేఖర్ భోజనంచేసి రిహార్సలుకి బయలుదేరాడు.

'సాయంత్రం అయిదున్నరకల్లా ఆఫీసు కారు వస్తుంది. నువ్వు సిద్ధంగా వుండు' అని చెప్పేసి వెళ్ళిపోయాడు.

ఆ సాయంకాలం పనులన్నీ చకచకా పూర్తి చేసుకుని, బాబుని తీసుకుని పక్కింటికి వెళ్ళింది.

'ఏం సుగుణా, యిలా వచ్చావు' అని అడుగుతూ బాబుని సుగుణ దగ్గరనుండి తీసుకున్నారు.

'ఇవాళ మీ అల్లుడుగారు వేసే నాటకం వుంది, పిన్నిగారూ. వాళ్ల యూనియన్ యానివర్సరీ ఫంక్షన్‌కి ఏర్పాటు చేసుకున్నారుట. మీరొస్తారేమో అడుగుదామని వచ్చాను' అంది.

'నువ్వు వెడుతున్నావంటే అది బాగుండే నాటకమే అనుకోవాలి. అల్లుడువేసే నాటకాలకి నువ్వు వెళ్ళడం నేను వేళ్ళ మీద లెక్కపెడుతున్నాను' అంటూ నవ్వారావిడ.

సుగుణకి జవాబివ్వడానికి ఏమీ లేనట్లు నవ్వేసి వూరుకుంది.

'నాకు యివాళ రావడానికి వీడదు, సుగుణా. కావలిస్తే బాబుని యిక్కడ వుంచేసి వెళ్ళు. నాటకం అవుతుండగా వీడు ఏడిస్తే—మధ్యలోనే లేచి రావలసి వస్తుంది' అంటూ సలహా యిచ్చారు.

'ఆ మాట నిజమేనండోయ్, పిన్నిగారూ! ఆ రోజు వీడి ఏడుపు మీకూ జ్ఞాపకం వుందా? విన్ని విధాలుగా చూశాం వీణ్ణి సముదాయించాలని! సినిమా మధ్యలో బయటికి వచ్చేశాం వూరుకోబెట్టడం మనవల్లకాక' అంది.

'అందుకే వీణ్ణి యిక్కడ వుంచేసేయి. నేను చూసుకుంటాను. ఆ పాలసీసా అవి యిచ్చి వెళ్ళు. ఇంతకీ ఒక్కర్తివే వెళుతున్నావా?' అని అడిగారు.

'కారు పంపిస్తానన్నారు. మరి నే వెళ్ళి బాబుకి కావలసినవి పట్టుకొస్తాను. టైమవుతోంది' అనేసి యింటికొచ్చింది.

బాబుకి అవసరమైన సరంజామా అంతా పిన్నిగారికి యిచ్చి వచ్చేసరికి కారు గుమ్మంలో ఆగి వుంది. ఇంటికి తాళంవేసి కార్లో కూర్చుంది. ఆ కార్లో సుగుణ కాక మరి ముగ్గురాడవాళ్లు వున్నారు. వాళ్ళు శేఖర్ సహోద్యోగుల భార్యలు. వారిలో యిద్దరి భర్తలు ఆ రోజు నాటకంలో వేషాలు వేస్తున్నారు. ఒకామె భర్త దర్శకత్వం వహిస్తున్నాడు. మాటల సందర్భంలో సుగుణ తెలుసుకున్న విషయాలు అవి. వారిద్దరూ తమ భర్తల నటన చూడడానికి వస్తున్నారు. మరి తనో...అతను వేసిన నాటకం చూస్తే—అతను సంతృప్తిపడి (ఎప్పుడోకాని రావడానికి యిష్టపడదు కనుక) తను పుట్టింటికి వెళ్ళడానికి వెంటనే అనుమతి ప్రసాదిస్తాడని ఆశిస్తూ వెడుతోంది.

సుగుణావాళ్ళు అక్కడికి చేరేసరికి నాటకం ప్రారంభించేశారు. సుగుణ ప్రక్కనే దర్శకుని భార్య కూర్చుంది.

నాటకం మొదలుపెట్టిన కొద్దిసేపటికి శేఖర్ పాత్ర ఏమిటో తెలిసింది సుగుణకి. నాయకుడి పాత్ర. నాటకాలంటే యిష్టపడని సుగుణ, శేఖర్ ఏ పాత్ర తీసుకున్నాడో అడగలేదు. అతను చెప్పలేదు. సుగుణ ఎప్పుడూ అడగదు కూడ. ఆ నాటకంలో నాయికగా నటిస్తున్న అమ్మాయి

చాలా నాజూగ్గా సన్నగా పొడుగ్గా వుంది.

శేఖర్, ఆ అమ్మాయియొక్క ప్రేమ ఘట్టాలు వచ్చినప్పుడల్లా ప్రేక్షకుల్లోంచి వినిపించే ఈలలు, చప్పట్లు వినలేక, పక్కనే వున్న ఆడవాళ్ల ముసి ముసి నవ్వులు భరించలేక—ఏదో ఒక వంక చెప్పి యింటికి పోదామా అనుకుంది సుగుణ.

శేఖర్, ఆ అమ్మాయి స్టేజిమీదకి వచ్చి నప్పుడల్లా తలవంచుకుని కూర్చోవాలనిపించేది సుగుణకి. కానీ, పక్కన కూర్చున్న దర్శకుని భార్య ఈర్ష్య అనుకుంటుందేమోనని గుడ్లప్పగించి నాటకం చివరి దాకా ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చుంది. కోపం, దుఃఖం, ఆవేదన పెనవేసి సుగుణని క్రుంగదీస్తున్నాయి.

ఎంత చనువు లేకపోతే ఆ అమ్మాయితో అంత యిదిగా నటించగలడు? అతని నాటకాల అభిరుచికి తగినట్లు తను లేకపోవడమేనా దీనికి కారణం? ఆ అమ్మాయి వాళ్ళ ఆఫీసుకి సంబంధించిన అమ్మాయే అయితే...

సుగుణ తనలో వున్న శక్తినంతా కూడదీసుకుని పక్కనే కూర్చున్న దర్శకుని భార్యని అడిగింది 'ఏమండీ హీరోయిన్‌గా వేస్తున్న అమ్మాయి బాగా నటిస్తోంది. వీళ్ళ ఆఫీసులో పనిచేస్తున్న అమ్మాయేనా? పేరేమిటో?'

'నాకు పేరు తెలియదండీ. డ్రామా వేసే వాళ్ళంతా ఒక ఆఫీసు తాలూకు వాళ్ళే. ఈ నాటకంలో నటించే అందరి పేర్లు అసలు పేర్లే గుర్తించినట్లు లేదు. చాలా ఆడ పాత్రలున్న నాటకం మొదట వేద్దామనుకున్నారుట. కాని వాళ్ళ ఆఫీసులో అమ్మాయిలు వప్పుకోలేదట. నాటకం మార్చి రాసుకున్నారని తెలిసింది. ఈ అమ్మాయి ఒక్కర్తే సమ్మతించి నట్లుంది. ఆడపాత్ర లేకపోతే ఏం బాగుంటుంది చెప్పండీ' అని సాగదీసింది ఆవిడ.

'ఆ ఆడపాత్రే నాకొంప ముంచేటట్లుంది కదండీ' అనుకుంది మనసులో. తను అడిగిన దానికి అంతపెద్ద జవాబు వస్తుందని సుగుణ అనుకోలేదు.

అయితే ఆ లెక్కన ఆ అమ్మాయి పేరు శ్రీదేవి అన్నమాట. చక్కని పేరు. శేఖర్ పక్కన ఆ అమ్మాయి చక్కగా సరిపోయింది అనుకుంది. తను ఎప్పుడు శేఖర్ పక్కన నిలబడినా పొట్టిగా వున్నట్లు తలచేది. ఆ అమ్మాయి తనకంటె పొడుగు. శేఖర్‌కి తగ్గ పొడుగు వుంది.

ఇంతకు ముందు అతను వేసిన నాటకాలకి (కొన్నిటికి) రానట్టే దీనికి కూడ తను రాదు అనుకున్నాడేమో! అందుకే అంత యథేచ్ఛగా నటించగలుగుతున్నాడు. అది నటనేనా???

"జనగణమన'తో ఆనాటి కార్యక్రమం పూర్తయింది.

'గ్రీన్ రూమ్‌కి వస్తారా వెడదాం' అని దర్శకుని భార్య అడుగుతూంటే సుగుణ ఊహాలోకంలోకి వచ్చింది.

సుగుణకి వెళ్ళాలని లేదు. కానీ శేఖర్ తనని ఒక్కర్తినే వెళ్ళి పొమ్మంటాడో, తను కూడ వస్తానంటాడో తెలుసుకోవాలి కదా అని ఆమెతోపాటు నడిచింది.

సుగుణని గుమ్మం దగ్గర వదలి ఎవరో పిలిస్తే ఆవిడ వెళ్ళిపోయింది. సుగుణ అక్కడి నుండీ నాలుగ్గక్కలా చూసింది. ఆ గదిలో చాలా మందే వున్నారు. సిగరెట్లు కాలుస్తూ కొందరు, కాఫీతాగుతూ కొందరు, రెండు పన్నాలు వదలి నోటికి మాత్రమే పని చెప్పిన వారు కొందరు వున్నారక్కడ.

సుగుణ కళ్ళు అన్వేషిస్తుంటే ఒక చోట నిలిచి పోయాయి. ఒకమూలగా శేఖర్ కూర్చుని వున్నాడు, అతనికి ఎదురుగా ద్వారం వైపు వీపుపెట్టి ఆ అమ్మాయి అదే హీరోయిన్‌గా వేసిన అమ్మాయి కూర్చుని వుంది.

అలా మూలగా కూర్చుని ప్రపంచాన్నే మరచిపోయినట్లు ఒకరితో ఒకరు నవ్వుతూ నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు. శేఖర్ భుజం మీద చెయ్యివేసి మరీ మాట్లాడుతోంది. ఆ అమ్మాయి. సుగుణకి కళ్ళు గిర్రున తిరిగిపోతున్నట్లుంది. వాళ్ళ దృష్టిలో పడకుండా తొందరగా వెళ్ళిపోవడమే వుత్తమం అనుకుంటూ వెను దిరిగింది.

'సుగుణా'

సుగుణ కాళ్ళకి బంధం పడినట్లయింది ఆ పిలుపుకి. నెమ్మదిగా వెనక్కి తిరిగింది.

'వెళ్ళిపోతున్నావేం? నేనూ వచ్చేస్తాను ఆగు' అన్నాడు శేఖర్.

'మీరు వచ్చేదాకా యిక్కడే నిలబడతాను. మీ పని యింకా అవలేదా?' కంఠాన్ని అదుపులోకి తెచ్చుకుని మామూలుగా అడిగింది

'నాకేం పెద్దపని లేదు. నా ఫ్రెండుకి నిన్ను పరిచయం చేస్తాను రా లోపలికి'



ఫలించని పథకం

అని పిలుచుకెళ్ళాడు లోపలికి.

సుగుణ తడబడే కాళ్లతో అతని వెంట నడిచింది. ఆ అమ్మాయి కూర్చున్న వైపే తీసుకెళ్ళాడు శేఖర్. ఆ అమ్మాయి కనుబొమలు ముడిచి చూస్తోంది వచ్చే యిద్దరినీ.

'అప్పుడే ఎంత అసూయ ... తనంత అందగత్తెని కానినా ఆ చిన్నమాపు? తాను తప్ప యింకెవరూ తన ప్రేమికుని ప్రక్క నిలబడడానికి అర్హులు కారా?' యిలా సాగిపోతున్నాయి సుగుణ ఆలోచనలు.

'ఈమె నా శ్రీమతి. పేరు సుగుణ.'

'శేఖర్ కంఠధ్వని చిన్నదిగా వున్నా సుగుణకి శంఖారావం చెవిలో పూరించినట్లుంది ఆ సమయంలో.

'నమస్తే' అంది తడబడుతూ.

'ఈమె వస్తున్నారని చెప్పలేదే నువ్వు' అంది నవ్వుతూ ఆ అమ్మాయి.

'నాకే తెలీదు. నీకేం చెప్తాను' అన్నాడు శేఖర్.

సుగుణ కాళ్ళకింద భూమి కదలి పోతున్నట్లుంది. ఇద్దరిమధ్యా సంబోధన ఏకవచనంలోనే సాగుతోంది. పునాది గట్టి పడిన స్నేహమే అనుకొంది. సుగుణ వుని కినే మరచి యిద్దరూ కబుర్లలో పడ్డారు మళ్ళీ. సుగుణ నెమ్మదిగా అక్కడినుండి తప్పుకుంది.

సుగుణ ద్వారందాటి, పక్కగా స్తంభం వుంటే అక్కడ నిలబడింది. అప్పటికే అందరూ వెళ్ళిపోయారు. ఏ అయిదారుగురో వున్నారు అక్కడ. 'పనేం లేదని యింకా ఆ కబుర్లేమిటో యిద్దరికీ' అని విసుక్కుంది. కొంతసేపు ఓర్పుగా చూసి పిలవడానికి లోపలికి వెళ్లిపోయింది. గుమ్మంలోనే ఆగి పోయింది.

'నీకు మనస్ఫూర్తిగా నా ధన్యవాదాలు అర్పిస్తున్నాను. మన పథకం ఫలించింది.' అంటూ శేఖర్ ఆ అమ్మాయివీపు తడు తున్నాడు.

అక్కడ కూర్చున్నది అమ్మాయి కాదే అనుకుంటూ రెప్పవాల్చకుండా చూసింది. తన కళ్ళని తనే నమ్మలేక తెల్లబోయింది లోపలి దృశ్యానికి.

ఆ చీర కట్టుకున్న వ్యక్తికి క్రాస్ క్రాప్. ఆడ మొహం. ఒక చేతిలో విగ్గు— ఒక చేతిలో సిగరెట్టు.

'వెళ్ళు — ఆవిడ బయట ఎదురు చూస్తున్నారో — తిరిగి యింటికెళ్ళి అలక పాన్పు పరిచారో' అంటూ నవ్వుతున్నాడు అతను.

'నే వెడుతున్నా — రేపు వుదయం యింటికి రా— కలిసే వెడదాం ఆఫీసుకి'. అని చెయ్యివూపి శేఖర్ ద్వారం వైపుగా నడిచాడు.

శేఖర్ రావడం చూసి దూరంగావెళ్ళి నిలుచుంది సుగుణ.

ఇద్దరూ మౌనంగా యిల్లు చేరు కున్నారు ఆ రాత్రి.

మర్నాడు వుదయం శేఖర్‌తోబాటే సుగుణకూడ తొమ్మిదిగంటలకే భోజనం చేసింది. సూట్‌కేసు, హోల్డాలు తెచ్చి సావిట్లో పెట్టింది. అర్థంకాక శేఖర్ అయోమయంగా చూశాడు.

'నేను పదిగంటల బస్సుకి మా వూరెడుతున్నాను' అంది సుగుణ నిదానంగా కుర్చీలో కూర్చుని తమలపాకులకి సున్నం రాస్తూ.

ఇకముందు జరగబోయే నాటకంలో తామిద్దరే పాత్రధారులు అని మనసులోనే చెప్పుకుంది.

'ఇవాళా ... మంచిరోజు నాలుగయిదు రోజుల తర్వాతే వుందన్నావు' విస్మయంగా అడిగాడు.

'పక్కింటి పిన్నిగారు యివాళ కూడ మంచిరోజే నన్నారు. ఎంత తొందరగా వెడితే అంత తొందరగా వచ్చెయ్యొచ్చని...' తమలపాకులు, వక్కపొడి శేఖర్ చేతిలో పెట్టింది.

అవి నోట్లో వేసుకోవాలనే ధ్యాసే లేదు అతనికి.

కాస్సేపు యిద్దరూ మాట్లాడుకోలేదు.

'ఇవాళ శ్రీదేవిగా నటించిన అమ్మాయి మనింటికి వస్తానంది' అంటూ ఆ నిశ్శబ్దాన్ని భంగపరిచాడు శేఖర్.

'ఎప్పుడొస్తుంది' ఆత్రుత కనబరుస్తూ అడిగింది.

'ఆఫీసుకి కలిసే వెడదామంది. ఇప్పుడే రావచ్చు.'

'ఆ అమ్మాయి బాగా నటించిందండీ. తప్పకుండా నా అభినందనలు తెలుపుతాను. నిన్నరాత్రే చెప్పాల్సింది. ఏమిటో బుర్రపని చెయ్యలేదు' అంది నొచ్చుకుంటూ.

'నీకు బస్సుకి టైమవుతోంది. నువ్వు



హోటలునుండి వచ్చాక మాట్లాడొచ్చు. రిక్షాకి ఎవరైనా వెళ్ళారా' అని అడిగాడు.

'పనిమనిషి వెళ్ళింది. నే వెళ్ళేలోపలే ఆ అమ్మాయినుంచి అభినందనలు తాజాగా అందుకుంటుంది' అంది ఉత్సాహంగా.

'ఆ అమ్మాయి యిక్కడే వుంటుంది' అన్నాడు చేతిలోవున్న పుస్తకం చూస్తూ.

'వంట వస్తే ఫరవాలేదు. మీకు హోటలుకూడా తప్పుతుంది' అంది.

శేఖర్ తలఎత్తి సుగుణని తీక్షణంగా చూశాడు. సుగుణ ముఖంలో బాధాచిహ్నాలు ఏవీ కనిపించలేదు.

'వంట చెయ్యాల్సిన ఖర్మం పట్టింది ఆ అమ్మాయికి'

'నేను వచ్చేదాకా హోటలు కూడా తప్పదన్నమాట మీకు. అసలా అమ్మాయి యిక్కడెందుకుంటోంది' అని నెమ్మదిగా అడిగింది.

దార్లోకి వచ్చింది అనుకున్నాడు శేఖర్.

'నేనే వుండమన్నాను యిక్కడ' అన్నాడు ముఖంలో ఏభావం వ్యక్తం కానీకుండా.

'నేను వచ్చేదాకానా? అయినా వాళ్ళ వాళ్ళు వూరుకుంటారా?' అని సందేహం వెలిబుచ్చింది.

'నువ్వువచ్చాకకూడ యిక్కడేవుంటుంది.' రెండో ప్రశ్నకి జవాబివ్వలేదు.

'వాళ్ళ వాళ్ళు వూళ్ళోలేరా' అంది రెండో ప్రశ్నకి సమాధానం రాకపోయేసరికి.

'ఇకమీదట అన్నీ నేనే' అన్నాడు.

సుగుణ తల వంచేసుకుంది ఆమాట వినగానే.

'మీ వాళ్ళని తీసుకొచ్చి గొడవచేస్తే ఏం ప్రయోజనం వుండదు. ఇప్పుడే చెప్తున్నా—అప్పుడు ఏడ్చికూడ ప్రయోజనం వుండదు.'

సుగుణ వంచిన తల ఎత్తలేదు. నెమ్మదిగా 'ఏడవను. మీరలా చెపితే అలాగే' అంటూ నోటికి కొంగు అడ్డుపెట్టుకుంది.

అంతవరకు సుగుణ ధైర్యానికి ఆశ్చర్యపోతున్న శేఖర్, భార్య నోటికి కొంగు అడ్డంపెట్టుకోవడం చూసి స్థిమితపడ్డాడు.

'నువ్వు తొందరపడి రాకు. నీకు ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడే వద్దువుగాని' అన్నాడు.

అప్పుడే ఒకతను లోపలికొచ్చాడు.

'మీ యింటి ముందు రిక్షా ఆగివుంది, శేఖర్' అన్నాడు.

అతని వెనకేవచ్చిన పని మనిషి 'రిక్షా వచ్చింది. అమ్మగారూ' అంది.

సుగుణ సామాను రిక్షాలో పెట్టించింది.

సుగుణ తను ఆశించిన మార్పుకి తీవ్రంగా ప్రవర్తించేసరికి నీరుగారిపోయాడు శేఖర్.

'వెళ్ళక తప్పదన్నమాట' అన్నాడు దిగులుగా రిక్షాలో కూర్చున్న సుగుణకి బాబుని అందిస్తూ.

శేఖర్ ప్రక్కనే నిల్చున్న తన్ని చూపిస్తూ 'శ్రీదేవిగారు పక్కనుండగా దిగులెందుకు' అంది.

రిక్షా సాగిపోయింది. ●

పిల్లలు—ఆరోగ్యము

మానసిక గ్రహణశక్తులు

పిల్లలు పుట్టినది మొదలు నెల రోజుల లోగా ప్రక్కలకి వొత్తిగిల్లగలరు. తలను నిలుపలేరు. మామూలుగా ముడుచుకొని పడుకుంటారు. ఒక వస్తువుపైన దృష్టిని నిలపలేరు.

మొదటి నెలకి గడ్డమును పైకెత్తి చూస్తారు. దృష్టిని ఒక వస్తువుపై నిలుప గలరు. కొద్ది కొద్దిగా ఏదైనా ఒక వస్తువుని చూపిస్తే చూపుని దానివైపు మరల్చ గలరు. తలని నిలపటం మాత్రం చేయలేరు.

రెండవ నెలలో చిరునవ్వు నవ్వుతారు. శబ్దాన్ని విని పరికించి చూస్తారు. కదిలే వస్తువు వెంబడి దృష్టిని తిప్ప గల్గుతారు.

మూడవ నెలలో తలని కొద్దిగా తిప్పి చూస్తారు. సంగీతం అంటే ఆసక్తి కనపరుస్తారు. 'అంగా' అనే శబ్దం నోట వెంట వస్తుంది.

నాలుగవ నెలలో చిన్న చిన్న వస్తువులని తీసుకుని నోటి దగ్గర పెట్టుకుంటారు. తల పూర్తిగా నిలప గలుగుతారు. ఎవరైనా పట్టుకుని కూర్చోపెడితే చాల సంతోషంగా కనిపిస్తారు. నిల్చోపెడితే కాళ్ళతో తన్న గలరు. పలకరిస్తే కేరింతలు కొడ్తారు.

ఏడవ నెలలో దొర్లటం ప్రారంభిస్తారు. ఎవరైనా పట్టుకుంటే కూర్చో గలరు. పెద్ద వస్తువులని ముందుకు వంగి గ్రహించి నోటి దగ్గరికి తీసుకొని వెళ్లగలరు. ఒక్క చేతినించి ఇంకొచేతికి వస్తువులని మార్చ గలరు. అద్దం చూసుకోడం అంటే యిష్ట పడతారు.

పదవ నెలలో పిల్లలు పాక గలరు. ఒకరి సహాయం లేకుండా కూర్చో గలుగుతారు. బొటన వేలు, చూపుడు వేళ్ళతో వస్తువుని పట్టుకో గలరు. ఎవరైనా ఆ వస్తువుని పట్టుకుంటే వదిలి వేయగలరు. దాచిన వస్తువులని తీయడానికి ప్రయత్నిస్తారు. అమ్మ, తాత, అనే మాటలు వస్తాయి. 'టాటా' చెప్పడం నేర్చుకుంటారు.

మొదటి సంవత్సరంలోగా ఒక చేతో పట్టుకుంటె నడవ గలరు. కుర్చీలు, మంచాలు పట్టుకుని నడువ గలుగుతారు. బట్టలు తొడిగేటప్పుడు సహకరించ గలరు. అమ్మ, తాత కాక యింకా రెండు మాటలు నేర్చుకుంటారు.

ఒక సంవత్సరం దాటిన తర్వాత మూడవ నెలలో తమంత తాముగానే పిల్లలు నడవ గలుగుతారు. మెట్లు ఎక్కడం నేర్చుకుంటారు. తెలిసిన వస్తువుల పేర్లు చెప్ప గలుగుతారు. కావల్సిన వస్తువుని దేనినైనా చూపించగలరు.

సంవత్సరన్నర వయసులో పిల్లలు పరిగెత్త గలగటం, చిన్న కుర్చీలో కూర్చోవటం కొన్ని మాటలు మాట్లాడటం, తమంతట, తామే ఆహారం తీసుకొనగలగటం గమనించవచ్చు.

రెండు సంవత్సరాల ప్రాయంలో పిల్లలు బాగా పరిగెత్త గలరు. మెట్లు దిగ గలుగుతారు. చెంచాని బాగా పట్టుకో గలగటం, బట్టలు విప్పడానికి సహాయపడటం చేయ గలరు బొమ్మల కథలందు ఆసక్తి కనపరుస్తారు. మరో ఆరు నెలలలో గుర్తుపట్టడం, పూర్తి పేరు చెప్పడం అలవాటు అవుతుంది.

మూడు సంవత్సరాలకి మామూలుగా ఒక కాలు వెంబడి మరో కాలువేసి నడువ గలరు. ఒంటికాలుమీద నిలబడతారు. మూడు చక్రాల సైకిల్ తొక్కడం అంటే ఆసక్తి కనపరుస్తారు. చెయ్యి కడుక్కో గలుగుతారు.

నాలుగు సంవత్సరాల వయసులో నిచ్చెన ఎక్కడానికి ప్రయత్నిస్తారు. కత్తెరతో కత్తిరించగలరు. ఆటలు మొదలు పెడ్తారు. తామకు తామే కాలకృత్యాలు తీర్చుకోడానికి పోగలుగుతారు.

అయిదవ సంవత్సరంలో స్కిప్పింగ్ వస్తుంది. బరువులని లెక్కించ గలుగుతారు. రంగుల పేర్లు చెప్ప గలుగుతారు. తమకు తామే బట్టలు వేసుకో గలుగుతారు. ఈ వయసులోనే పెద్దలని అనేకరకాల ప్రశ్నలతో విసిగిస్తుంటారు.

—డా. కె. వెంకటేశ్వరరావు